మూగజీవాల వేదన

- పశు వైద్యశాలలను వేధిస్తోన్న మందుల కొరత
- సకాలంలో మూగజీవాలకు అందని వైద్యం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- పశు యజమానులకు తప్పని తిప్పలు



ఆవు ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న పశువైద్యురాలు(ఫైల్)

రామభద్రపురం: మూగజీవాల సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఏవైనా వ్యాధులు సోకితే వాటికి సకాలంలో వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశు వైద్యశాలల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో లేవు. దీంతో పశు యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, పశు సంచార వాహనాల ద్వారా మూగజీవాలకు అవసరమైన వైద్యాన్ని సకాలంలో అందించేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మాత్రం పశు సంచార వాహనాలపై ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ ఫొటో, పేర్లను తొలగించడంపై పెట్టిన శ్రద్ధ మూగజీవాల ఆరోగ్యం, సంరక్షణపై కనబరచడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిలిచిన మందుల సరఫరా..

మూగజీవాలే కదా బతికినా.. చచ్చినా ప్రశ్నించేవారెవరు అనే రీతిలో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా పశు వైద్యశాలలకు మందులు సరఫరా చేయడం లేదు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసిన మందులనే ఇప్పటివరకు సర్దుబాటు చేస్తూ వచ్చారు. ప్రతీ పశు వైద్యశాలకు మూడు నెలలకోసారి రూ.50 వేల నుంచి రూ.70 వేల విలువైన మందులు అవసరమవుతాయి. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల్లో పాడి ఆవులు, ఎద్దులు కలిపి



గతంలో రైతు భరోసా కేంద్రానికి సరఫరా చేసిన మందులు చూపిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్(ఫైల్)

మొత్తం 65,357, గేదెలు 9,080, గొర్రెలు 78,410, మేకలు 24,309, కోళ్లు 1,91,177 ఉన్నాయి. వీటికి అత్యవసర చికిత్స నిమిత్తం ఉపయోగించే యాంటీ బయోటిక్స్, పెయిన్‌కిల్లర్స్, బాగా మేత మేయడానికి వాడే మందులు, కాల్షియం, ఎముకల పొడి వంటి దాదాపు 300 రకాల మందులను ప్రభుత్వం వైద్యశాలలకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు అటువంటి చర్యలేవీ కనిపించకపోవడంతో పశు వైద్యశాలల్లో ఉన్న కొద్దో గొప్పో ఉన్న మందులను వినియోగిస్తూ వస్తున్నారు. అక్కడ లేకపోతే బయట మందులు కొనుగోలు చేసుకోవాలని పశు యజమానులకు వైద్య సిబ్బంది సూచిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



పశు వైద్యశాలల్లో మందుల కొరతపై ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. జిలా ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చాం. త్వరలో మందులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న వాటితో సర్దుబాటు చేస్తున్నాం. ప్రతీ మూడు నెలలకోసారి మందులు రావాలి. రావడం లేదు.

– ఎల్.విష్ణు, ఏడీ, పశు సంవర్ధక శాఖ, బొబ్బిలి

వైఎస్సార్ సీపీ హయాంలో ఇలా..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పశువులకు సంబంధించిన మందుల కోసం ఇండెంట్ పెట్టేందుకు జిల్లా స్థాయిలో ఓ కమిటీ ఉండేది. పశు వైద్యశాలల్లో విధులు నిర్వహించే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏడీఏలు ఇలా ఎవరికి వారు తమ పరిధిలో ఉండే పశువులకు ఇతర మూగజీవాలకు ఎలాంటి మందులు కావాలో ఇండెంట్ పెట్టుకునే అవకాశం ఉండేది. ప్రతీ మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా మందులను పశు వైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం పశువైద్యులు ఇండెంట్ పెట్టిన మందులు కూడా లేకపోవడంతో ఉన్నతాధికారులు సైతం చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది.

బయట షాపుల్లో కొనాలి..

ప్రధానంగా యాంటీ బయాటిక్స్, పొట్ట ఉబ్బరం వస్తే ఉపయోగించే టిమ్‌ఫోనిక్, పొదుగు వ్యాధి వస్తే ఉపయోగించే మందులతో పాటు చర్మవ్యాధుల నివారణకు ఉపయోగించే పారాసిటమాల్ మందుల కొరత బాగా ఉంది. దీంతో పశువులు, మేకలు, గొర్రెల యజమానులు ఆయా వ్యాధుల నుంచి తమ మూగజీవాలను కాపాడుకునేందుకు బయట మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలోని దాదాపు అన్ని పశు వైద్య కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని సత్తా



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొయ్యాన జ్యోతి సత్తా చాటింది. ఇటీవల కాకినాడలో జరిగిన పోటీల్లో జిల్లా తరఫున ఆడి, జట్టును ప్రథమ స్థానంలో నిలపడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు పీడీ బంగారునాయుడు సోమవారం తెలిపారు. సదరు విద్యార్థిని పాఠశాల సిబ్బంది అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

బస్‌షెల్టర్ ప్రారంభం



బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామంలో కొత్తగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన కొల్లి రామినాయుడు తన సతీమణి కొల్లి లక్ష్మి జ్ఞాపకార్థం ఈ బస్‌షెల్టర్‌ను నిర్మించగా, ఆయన సేవను మాజీ ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొత్స కాశినాయుడు, జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమరాల ఏర్పాటు



స్తంభానికి సీసీ కెమరాలు అమర్చుతున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద సోమవారం సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. నేర నియంత్రణకు, నేరస్తులను పట్టుకోవడానికి ఉపకరిస్తుందన్న నేపథ్యంలో స్థానిక యువత సహకారంతో వీటిని ఏర్పాటు చేసినట్లు సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. మండలంలోని బంగారువలస గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి, అక్కడి సిబ్బంది, విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను వివిధ ప్రశ్నలడిగి వారి అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలి



సత్యారావు సతీమణి జగదీశ్వరికి ప్రశంసా పత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పట్టణ పరిధిలోని లచ్చయ్యపేటకు చెందిన అల్లాడ సత్యారావు నేత్రాలను దానం చేసినందుకు గాను ఆ కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ తరఫున ప్రశంసాపత్రం సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలని, ఇప్పటివరకు రెడ్‌క్రాస్ ద్వారా 980 మందికి చూపును ప్రసాదించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంటను కాపాడుకోవడంలో జాగ్రత్తలు పాటించాలి



రాజాం సిటీ: పెనుబాకలో తడిచిన వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న రైతు

రాజాం సిటీ: తుపాను వర్షాలకు తడిచిన వరి పంటను కాపాడుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని ఏవో ఎం.రేణుకాసాయి సూచించారు. మండలంలోని పెనుబాక, అంతకాపల్లి, పొగిరి గ్రామాల్లోని పొలాల్లో తడిచిన వరి పనలు పాడవ్వకుండా ఉప్పు ద్రావణం పిచికారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. వర్షానికి తడిచిన ధాన్యం గింజలు మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని తెలిపారు.

తెర్లాం: తుపాను వర్షాలకు తడిచిన వరిచేనును కుప్పలుగా వేసేముందు రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో జి.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో నీటమునిగిన, వర్షానికి తడిచిన వరి పంటను ఆయన పరిశీలించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. తడిచిన వరిచేనును కుప్పలుగా వేసేముందు ఎకరానికి 25 కిలోల గల్ల ఉప్పును ప్రతీ వరుసలోని పనలపై జల్లుకుంటూ కుప్పలు వేయాలని తెలిపారు. తడిచిన వరి పనల నుంచి గింజలు మొలకెత్తకుండా ఉప్పును పనలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు.

వంగర: ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం ద్వారా తడిచిన వరి పనలను కాపాడుకోవచ్చని ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. ఇదే విషయమై ఆయన మాట్లాడుతూ వానకు తడిచిన ధాన్యం గింజల నుంచి మొలకలు రాకుండా లీటరు నీటిలో 50 గ్రాముల గల్ల ఉప్పు వేసి ఆ ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలన్నారు.

బాడంగి: మండలంలోని అచ్చియ్యపేటలో తడిచిన వరి పనలను ఏ విధంగా రక్షించుకోవాలన్న అంశంపై ఏవో శిరీష అవగాహన కల్పించారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీఎం గోవిందరావు అన్నారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గ్రామైక్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని మహిళా సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. పొదుపు నిల్వలతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపులపై ఆరాతీశారు. రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే చేయండి

బొబ్బిలి: పట్టణాలు, గ్రామాల్లో ఎంఎస్‌ఎంఈ సర్వే చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆర్‌డీవో జేవీవీఎస్ రామ్మోహనరావులు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో సోమవారం సమావేశమైన వారు.. రైతుల ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీవో రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందర్, ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



రేగిడి: అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రేగిడి: పోలిపాడ్యమి పురస్కరించుకుని, మండలంలోని వన్నలి గ్రామంలో అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, సంతకవిటి మండలంలోని కృష్ణంవలస, కొండగూడేం, మాధవరాయపురం గ్రామాల నుంచి మూడు వేల మంది ఈ కార్యక్రమానికి విచ్చేసి, అన్నప్రసాదం స్వీకరించారు. కార్తీకమాసం ముగిసినందున ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వంగర: మండల కేంద్రంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు

కార్తీకమాసం ముగింపు సందర్భంగా పోలిపాడ్యమి పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయాలకు చేరుకున్న మహిళలు ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. శివకేశవులకు అత్యంత ఇష్టమైన ఈ మాసంలో వచ్చే చివరి రోజున ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు సమర్పించిన గంగాహారతితో దీపాల వెలుగులో ఆలయాలు సరికొత్తగా మెరిసిపోయాయి.

– బొబ్బిలి, రాజాం



రాజాం సిటీ: రాజాంలోని మల్లికార్జునకాలనీ గాయత్రి ధ్యాన మందిరంలో భక్తుల పూజలు



రామభద్రపురంలో పూజలు చేసినానంతరం శునకానికి ప్రసాదం తినిపిస్తున్న మహిళలు



బొబ్బిలిలో చల్లని బంగారమ్మ కోవెల వద్ద భక్తుల సందడి



తెర్లాం: కొరటాం శివాలయానికి పోటెత్తిన భక్తులు



రేగిడి: భక్తులతో కిటకిటలాడుతున్న సంకిలి శివాలయం



వంగర: సంగాం ఆలయంలో భక్తులు



రాజాం గాయత్రి కాలనీలోని కాశీవిశ్వేశ్వరాలయం వద్ద భక్తుల గంగాహారతి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



భగవద్గీత గొప్పతనం తెలియజేస్తున్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహనరావు, త్రినాధరావు, దామోదరరావు అన్నారు. మండలంలోని దేవుదళ గ్రామంలో వెలసిన గీతాశ్రమంలో భగవద్గీత పఠనంపై సోమవారం అవగాహన కల్పించారు. భగవద్గీతలోని అంశాలను ఏ విధంగా చదివి, అర్థం చేసుకోవాలో తెలిపారు. అందరూ భగవద్గీత చదివి, అందులోని సారాంశాన్ని గ్రహించి, ఉన్నత జీవనం సాగించాలన్నారు.

సురక్షితంగా బయటకు..



బొబ్బిలి పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఓ పెద్దగుంతలో ప్రమాదవశాత్తు పడిపోయిన ఆవును సీఐ కె.సతీష్‌కుమార్ సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. సోమవారం సాయంత్రం ఆవు గోతిలో పడిపోయిందన్న విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఆయన.. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, క్రేన్ సాయంతో ఆ ఆవును బయటకు తీయించారు. సదరు సీఐ సేవలను స్థానికులు అభినందించారు.

– బొబ్బిలి

దుర్గంధం.. భరించలేం..!



రాజాం పట్టణ పరిధిలోని బుచ్చింపేటలో పారిశుధ్య లోపం నెలకొంది. నిత్యం దుర్గంధం వెదజల్లుతోందని, ఆ దుర్వాసన భరించలేకపోతున్నామని అక్కడి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న డస్ట్‌బిన్‌ల్లోని చెత్త తొలగించకుండా వారం రోజుల పాటు అలాగే వదిలేస్తుండడంతో అది కుళ్లి, కంపు కొడుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. అటువైపుగా వెళ్లాలంటే ముక్కులు మూసుకుని మరీ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టేలా అధికారులే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– రాజాం

చినుకు పడితే చిత్తడే..



రాజాంలో బొబ్బిలి రోడ్డులో సివిల్ సప్లయి స్టాక్ పాయింట్ ప్రాంగణం అధ్వానంగా తయారైంది. చినుకు పడితే చాలు ఆ ప్రాంతమంతా చిత్తడి.. చిత్తడి.. అవుతోంది. ఇక్కడి నుంచే రాజాం, సంతకవిటి మండలాల్లోని గ్రామాల రేషన్ డిపోలకు సరుకులు సరఫరా అవుతాయి. వర్షం కురిసిన ప్రతీసారి బురదమయమయ్యే ఈ ప్రాంతంలో లోడింగ్, అన్‌లోడింగ్‌కు వచ్చే ట్రాక్టర్లు, లారీలు బురదలో కూరుకుపోతున్నాయని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ ప్లాట్‌ఫాం వేయించాలని కోరుతున్నారు.

– రాజాం

విద్యుత్ చార్జీల పెంపుతో నిలువు దోపిడీ

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి విమర్శించారు. ఇదే విషయమై వారు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల అమలు అటకెక్కించి ఆరు నెలల వ్యవధిలో రెండు దఫాలు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజల పొట్ట కొట్టారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరొకమాట చెప్పడం చంద్రబాబు నైజమని దుయ్యబట్టారు. స్మార్ట్ మీటర్లపై కూడా అప్పుడు తప్పు డు ప్రచారం చేసి, నేడు అవే స్మార్ట్‌మీటర్లను ఎందుకు తెస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలతో సామాన్యులు ఆర్థికంగా కుదేలయ్యారన్నారు. కూటమి నేతల మాయమాటలు, అబద్ధాలు నమ్మి మోసపోయామని ప్రజలు ఇప్పటికే పశ్చాత్తాప పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. జగనన్న ఉంటే బాగుణ్ణు అని అనుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాసమస్యల పరిష్కార వేదిక’ను సద్వినియోగం చేసుకోండి



వినతిపత్రం అందుకుంటున్న తహసీల్దారు హేమంత్‌కుమార్



బాడంగి: అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తెర్లాం: రైతు భూ సమస్యలతో పాటు గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల ప్రజలు, రైతులు వచ్చి వారి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ఎటువంటి సమస్య పరిష్కారానికైనా జిల్లా కేంద్రానికి వెళ్లవద్దని, మండల కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రేగి రాంబాబు, ఎంఈవో త్రినాధరావు, ఏవో సునీల్‌కుమార్, ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండల కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమానికి మండలంలోని కామన్నవలస గ్రామానికి చెందిన పలువురు రైతులు హాజరై, తమ భూ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, తహసీల్దారు సుధాకర్‌లకు వినతిపత్రం అందజేశారు. 200కు పైగా సర్వే నంబర్లు కలిసిపోయాయని, దీంతో ఆన్‌లైన్‌లో తమ భూముల వివరాలు కనిపించడం లేదని వారు వినతిపత్రంలో కోరారు.

అన్నదాత ఆవేదన

వంగర: తుపాను కారణంగా కురిసిన వర్షాలకు పలుచోట్ల పొలాల్లోని వరి పనలు, కుప్పలుగా వేసి ఉంచిన వరి కుప్పలు బాగా తడిచిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట సరిగ్గా చేతికి అందే సమయంలో పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.